క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేయాలి



కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంటూరు కాలనీలోని ఆయన నివాసంలో పలువురు నిరుద్యోగులు వివిధ సమస్యలపై సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 317ను రద్దు చేసి, ఉపాధ్యాయ, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలన్నారు. పార్టీ నాయకులు దాసరి వెంకటేష్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

రెబ్బెన: బాలికలు, మహిళలు షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం ఇన్‌చార్జి సునీత కోరారు. మండలంలోని తుంగెడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో వ్యక్తిగత సమాచారం పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో భాగంగా మనుషుల అక్రమ రవాణా, చట్టవ్యతిరేకంగా దత్తత సేకరణ, బాల్యవివాహాలు, శ్రమ దోపిడి, వ్యవస్థీకృత భిక్షాటన వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే బాలికలు, మహిళలు 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే షీటీం నంబర్ 8712670564ను సంప్రదించాలని కోరారు. హెచ్‌ఎం స్వర్ణ, షీటీం సభ్యులు శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎఫ్‌డీఓ వేణుబాబుకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని వివిధ రేంజ్‌ల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. స్థానిక డివిజన్ కార్యాలయం ఎదుట సంఘం డివిజన్ అధ్యక్షుడు తాజ్ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది నిరసన తెలిపారు. అనంతరం ఎఫ్‌డీఓ వేణు బాబుకు వినతిపత్రం అందజేశారు.

కోయవాగులో మట్టి సేకరణ



మట్టిని సేకరిస్తున్న శ్యాంరావు

కాగజ్‌నగర్‌రూరల్: నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోయ వాగు గ్రామంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లెండుగురె శ్యాంరావు ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా తిరుగుతూ మట్టిని సేకరించారు. అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటి నుంచి పిడికెడు మట్టిని సేకరించి ఢిల్లీలోని అమృత వన నిర్మాణానికి వినియోగించనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల: పద్దెనిమిది ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సీఐ సాదిక్ పాషా సూచించారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అర్హులందరూ ఈనెల 19లోగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన బస్టాండ్లు

- కొన్నిచోట్ల నిర్వహణ అస్తవ్యస్తం
- ఎక్కడపడితే అక్కడ చెత్త
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు
- తాగునీరు లేక ప్రయాణికుల ఇక్కట్లు



ముత్తంపేట గ్రామంలోని మినీ బస్టాండ్ దుస్థితి

కౌటాల: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని అధికారులు జోరుగా ప్రచారం చేస్తున్నా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. మండలంలోని బస్టాండ్ల నిర్వహణ అధ్వానంగా మారాయి. కొన్ని గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రయాణికులు ఆరుబయటకు వెళ్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆయాచోట్ల మినీ బస్టాండ్‌ల నిర్వహణ చేపట్టకపోవడంతో చెట్ల కింద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. కౌటాల ఆర్టీసీ ప్రధాన ప్రాంగణంలోని మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో పలువురు ఆరుబయట మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ ఆవరణంతా దుర్గంధం వస్తోంది. పందుల స్వైరవిహారంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. తలోడి, ముత్తంపేట, గుండాయిపేట, తదితర గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాల నిర్వహణ కరువయ్యాయి. ఈ ప్రాంగణాలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి దర్శనమిస్తున్నాయి.

నిర్మాణం సరే..నిర్వహణ ఏదీ?

మండల కేంద్రంలోని ప్రధాన ప్రయాణ ప్రాంగణంతోపాటు గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాల నిర్మాణాన్ని చేపట్టిన నిర్వహణ కరువైంది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి ప్రాంగణాల నిర్మాణాన్ని చేపట్టినప్పటికి ప్రయోజనం లేకుండా పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతోపాటు ప్రయాణ ప్రాంగణాలు అపరిశుభ్రత వాతావరణం దర్శనమిస్తున్నాయి. తలోడి, గుండాయిపేట్, ముత్తంపేట గ్రామాల్లో గల మినీ ప్రయాణ ప్రాంగణాలు బీటలు వారి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు చెట్ల కింద సేదతీరుతున్నారు.



అపరిశుభ్రంగా తలోడి మినీ బస్టాండ్

ఇప్పటికైన అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి



గ్రామాల్లో గల ప్రయాణ ప్రాంగణాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. చెట్ల కింద ఉండాల్సి వస్తోంది. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. గ్రామంలోని మినీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి. అధికారులు ప్రయాణ ప్రాంగణాలకు నిర్వహణ కల్పించి ఉపయోగంలోకి తేవాలి.

– ప్రవీణ్, గుండాయిపేట

పట్టించుకోవాలి



కౌటాలతోపాటు అన్ని గ్రామాల్లో బస్టాండ్లకు నిర్వహణ లేదు. ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. అపరిశుభ్రతంగా ఉన్నాయి. కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి. అధికారులు పట్టించుకుని వాటికి నిర్వహణ కల్పించాలి.

– కె.ఆనంద్‌రావు, ప్రయాణికుడు

కార్మికుల డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె ఉధృతం



మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు లోకేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని జేఏసీ నాయకుడు లోకేశ్ స్పష్టం చేశారు. కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 10వ రోజూ చేరింది. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెకు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాజొద్దీన్, రాధాకృష్ణాచారి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ధనోరా, మాణిక్ గుడ పంప్‌హౌజ్‌లను బంద్ పెట్టడానికి కార్మికులు సిద్ధం కావాలన్నారు. ఎల్‌అండ్‌టీ, ఎవరెస్ట్ కంపెనీ యజమాన్యాలు కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నం.60ని అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను త్వరగా విడుదల చేయాలని, ప్రతి కార్మికుడికి సంబంధిత అధికారులే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశత్తు మరణిస్తే కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలేశ్, బుడ్డయ్య, సాయి, సంతోష్, శ్రీనివాస్, శంకర్, మొండయ్య, జాదవ్, ఈశ్వర్, వెంకటేశ్, రవీందర్, సోహెల్, రమేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం’



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్

తిర్యాణి: రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డీవైఎఫ్ఐ ప్రథమ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. మండలంలో మౌలిక సదుపాయలు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, నాయకులు టీకానంద్, పవన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మండల కమిటీ

డీవైఎఫ్ఐ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్, కార్యదర్శిగా దుర్గం శ్రీనివాస్‌తోపాటు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఆదివాసీ ఎమ్మెల్యేతోనే అభివృద్ధి సాధ్యం

కెరమెరి: ఆదివాసీ ఎమ్మెల్యేలతోనే అభివృద్ధి సాధ్యమని ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి చహకటి రాంకిషన్ అన్నారు. కొఠారి గ్రామంలో సోమవారం ఆదివాసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు ఆదివాసీలై ఉండాలని, అన్ని పార్టీల అధిష్ఠానం ఆ దిశగా టికెట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో సోనేరావు, బీర్సా, గంగారాం, ఈశ్వర్, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

సమానపనికి సమాన వేతనం చెల్లించాలి

- 12వ రోజుకు చేరిన ఎన్ఎంహెచ్ స్కీం ఉద్యోగుల సమ్మె
- నేడు డీహెచ్ కార్యాలయం ముట్టడి



ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రారంభించిన నిరవధిక సమ్మె సోమవారానికి 12వ రోజూ చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎలాంటి షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని, ఉద్యోగులపై సవితి తల్లి ప్రేమ సరికాదన్నారు. ఉద్యోగులు గత 23 ఏళ్లుగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. నాయకులు దివాకర్, పిడుగు శంకర్, బుడిపల్లి మధుకర్, షకీల్, క్రిష్ణ, అనూష, సునీత, విజయ, రజని, లీల, వెంకటేశ్, మధుకర్, సధాలక్ష్మి, సదానందం, శ్రీదేవి, మమత, రజితి, వెంకటేశ్, విజయ, సంగీత, లింగన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెబాట



బెజ్జూర్: సమ్మెలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రెబ్బెన: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరీ, స్వర్ణలత, మంజుల, బాలమ్మ, తిరుపతమ్మ, రాజేశ్వరీ లతో పాటు పాల్గొన్నారు.

దహెగాం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. సంఘం మండల అధ్యక్షులు జె.జమ, విజయలక్ష్మి, కల్పన, పద్మ, పార్వతి, విజయ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో అంగన్‌వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. సమ్మె విరమించాలని ఎంపీఓ సుధాకర్ రెడ్డి కోరగా తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని వారు తేల్చి చెప్పారు. శ్రీలత, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరవధిక దీక్షా శిబిరంలో సీఐటీయూ నాయకుడు వెలిశాల కృష్ణమాచారి పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కెరమెరి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. వీరికి సీఐటీయు సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్ సంఘీభావం తెలపారు.

వాంకిడి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎటు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. నాయకులు ఉమాదేవి, సువర్ణ, వీణా, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.



దహెగాంలో..



కెరమెరిలో..



రెబ్బెనలో..

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

ఆసిఫాబాద్‌అర్బన్: ఐసీడీఎస్ పరిధిలో పని చేస్తున్న అంగన్‌వాడీలు తమ డిమాండ్లను పరిష్కరించాలని తలపెట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా దస్నాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రానికి సూపర్‌వైజర్ సుజాత, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో వంశీ సమక్షంలో అధికారులు సోమవారం తాళం వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పొలాల సందడి





కౌటాల: గ్రామాల్లో ఈనెల 14న పొలాల అమావాస్య పండుగ జరుపుకోనున్నారు. మండల కేంద్రంలోని వారసంతలో సోమవారం పొలాల సందడి నెలకొంది. పొలాలకు చివరి వారసంత కావడంతో సమీప గ్రామాల రైతులు వచ్చి ఎద్దుల అలంకరణ కోసం సామగ్రిని కొనుగోలు చేశారు. కొత్త దుస్తులు, పిండి వంటల సామగ్రి కొనుగోలుకు మహిళలు బారులు తీరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న కోనేరు వంశీ

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన గోలేటి మారుతి జ్వరంతో ఆదివారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ సోమవారం పరామర్శించారు. తక్షణసాయం రూ.10వేలు అందించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, కొండపల్లి సర్పంచ్ ఉపాసీ సంజీవ్, బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, మారన్న, ఇలియాస్, సకరాం, రామన్న తదితరులు ఉన్నారు.

‘ఓటరు’ పరిశీలన ప్రక్రియ వేగవంతం

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీ పాల్గొన్న కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్ఎస్ఆర్ 2023లో భాగంగా ఓటరు నమోదు, జాబితాలో సవరణలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు రాజేశ్వర్, సురేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతు ఓటరు నమోదు, సవరణలకు అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, లింగ నిష్పత్తి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలించి త్వరగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఆదివాసీ గ్రామాల్లో పద్మశ్రీ గుసాడి కనకరాజు కళాబృందంతో ఓటరు జాబితాలో ప్రత్యేక మార్కింగ్ చేస్తామన్నారు. కళాశాలల్లో యువకులను ఓటరు జాబితాలో చేర్చేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆలయ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని కాప్రి గ్రామంలో హనుమాన్ ఆలయం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు సోమవారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్, నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

బెజ్జూర్: అన్నిదానాల కంటే రక్తదానం ఎంతో గొప్పదని ఏఎస్పై మోహన్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బెజ్జూర్ పోలీసులు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కానిస్టేబుల్, ఆర్ఎంపీలతోపాటు, యువకులు మొత్తం ఎనిమిది మంది రక్తదానం చేయగా వారిని అభినందించారు. వైద్యులు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): టీబీజీకేఎస్‌కు చెందిన సేఫ్టీ కమిటీ సభ్యులు ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో ఉద్యోగుల రక్షణ కోసం పాటుపడాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో కైరిగూడ, గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లకు చెందిన సేఫ్టీ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్షణ కోసం సేఫ్టీ కమిటీ సభ్యులంతా అప్రమత్తంగా ఉంటూ గని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల పని స్థలాల్లో రక్షణ విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. గత రెండేళ్ల నుంచి బెల్లంపల్లి ఏరియాలో గని ప్రమాదాలు తగ్గటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జీఎం కమిటీ సభ్యులు సమ్మయ్య, అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, ఫిట్ కార్యదర్శులు మేరుగు రమేశ్, కందుల తిరుపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న దంపతులు

కెరమెరి: మండలంలోని గోయగాం గ్రామంలో నంది, గణపతి, శివలింగం, శివుడు, తదితర విగ్రహాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. పుజారి మొహర్లే శంకర్ ఆధ్వర్యంలో పురోహితులు వాసుదేవ్, బాలాజీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. హోమం నిర్వహించారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

లయన్స్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ ఆవరణలో సోమవారం ఉచిత బీపీ, షుగర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. కోదండరాం, వైద్యుడు జయంత్ దేశ్‌ముఖ్, క్లబ్ అధ్యక్షులు ఉబేద్‌బిన్ యాహియా (తిరిఖ్) కార్యదర్శి పుల్లూరి శంకర్, డైరెక్టర్లు నాంపల్లి శంకర్, జెడ్పీ కోట వెంకన్న పాల్గొన్నారు.